

# గాలి

—సి. ఆనందారామం

అబద్ధం కాదు! నిజం! కాదు! నిజమూ, అబద్ధమూ కాని మరేదో వచ్చి ప్రకృతి సత్యం.

"క్రేకీ!"

"అదేం పిలుపు? రోజుకో కొత్త పేరు?"

"నిన్ను చూస్తే సృజన అలా తన్నుకొస్తుంది."

"ఇంతకూ ఆ పిలుపుకి అర్థం?"

"క్రేకీ కి స్త్రీలింగం!"

నవ్వేసింది. అత నలా మాట్లాడుతోంటే నవ్వకుండా ఉండలేదు. ఆ బలహీనత అతనికీ తెలుసు:

"అవును, క్రేక్‌నే! అందుకే మిమ్మల్ని..."

"ఆపెయ్యావేమ్? అరిగిపోయిన మాటలు! చేతనయితే కొత్త ప్రయోగాలు సృష్టించుకోవాలి!"

"మీరు సృష్టిస్తున్నారుగా కొత్త ప్రయోగాలు! రాత్రి వరూధినికి స్వయంగా మెడలో మాల వేసి సత్కరించారుగా!"

"ఏమిటి?"

"ఏం? గుర్తు లేదా? బహిరంగ సభలో వరూధిని మెడలో స్వయంగా మాల వెయ్యలేదూ? అలా ఆవిడని వరించాక ఇంకా నాతో మాట లెందుకూ?"

"నిజంగా గుర్తు లేదు. వరూధిని మెడలో మాల వేశానా? సారీ! ఆవిడని స్త్రీ అనుకొని ఉండను!"

నవ్వు .. "చ! అందుకా! కళ్ళు రెండూ నీళ్ళతో నిండిపోయింది."

అందుకు కాదు. మనసులో రొద. ఆ రొద లోంచి ఒక హస్కీ వాయిస్. "ఇంతకూ నువ్వు నన్నెందుకు ఏంచుకొన్నట్లు?" గాయపడిన అహం ఆ కంఠంలోని బ్లండర్! బ్లండర్ జరిగిపోయింది. మనసు పొరల్లో నలిగిపోతున్న సెన్సిటివ్ నేచర్ ఎలుగెత్తి ఏడవాలని చూస్తోంది.

దోషినని కుంచించుకుపోయే అంతరంగం శిక్ష పడితే బాగుండున్నని ఎదురు చూస్తోంది. కానీ, ఏ రకం శిక్ష? నిజంగా జరిగిన బ్లండర్‌కి తగిన శిక్ష అనుభవించవలసి వస్తే తను భరించగలదా? అలాంటి శిక్షను ఆహ్వానించటం మరో బ్లండర్ అవుతుందేమో! జరిగిందంతా మరిచిపోయి, ఏం జరగనట్లుగా ఉండటం తన కెందుకు చేతకావటం లేదు? ఆ హస్కీ వాయిస్‌కి అంత శక్తి ఉందని తెలిస్తే ఆది ఇంతగా తనను వేధిస్తుందని వూహించి ఉంటే — ఆ రోజు మనసులో ఎన్నో ఉరుములు గర్జిస్తున్న వేళ—దూరంగా—ఎంతో దూరంగా పారిపోయి ఉండేది.

"ఏదో ఘోరం జరిగిందని తన బాధ కాదు. ఆ హస్కీ వాయిస్ తనను వదలటం లేదనే బాధ. ఆ ధ్వని వట్టి గాలి అని తెలిసీ...

"నేను కలకత్తా వెళ్తున్నాను" ఫోన్‌లో తను.

"వెళ్ళు."

"ఎవరితో అని అడగరేం?"

"ఇంకెవరితో? నాతోనే?"

"లేదు! మీతో కాదు. నేను మరో ఫ్రెండుతో వెళ్తున్నాను." హమ్మయ్య! మనసు కొంత శాంతించింది! లేదు! శాంతించటం లేదు. అతనికి నిజంగా కోపం వస్తే? నవ్వే ఆ కళ్ళు ఎర్రబడితే? హమ్మో!అంతకంటె చావు నయం! కాని ఈ హస్కీ వాయిస్ వదలకుండా తన మనసులో రొద చేస్తోంటే ఎలా అతనితో నిష్కల్మషంగా నవ్వటం? ఇది ఇలా ఉంటుందని తెలియదే? వూహించలేదే!

"నీకు నాకంటే మంచి ఫ్రెండ్ ఉంటే, నిజంగా ఫ్రెండ్ అయితే, వెళ్ళు. నే నెందుకువద్దంటాను." గాంభీర్యంతో కూడిన పదును కంఠంలో ... తాను నిలబడిన భూమి దద్దరిల్లింది. కాళ్ళ క్రింది ఆధారం తొలిగిపోయి అగాధాలు తొంగి చూస్తున్నాయి.

"నాకు ఏ ఫ్రెండ్సూ లేరు. ఏకంగా సన్యాసం తీసుకొందామనుకుంటున్నాను."

అబద్ధం! కాదు! నిజం? ఆ హస్కీవాయిస్ తన ఫ్రెండ్ కాదు. కాలేదు. కాలేదని తనకు తెలుసు. అది గాలి! కేవలం గాలి! అయ్యో! పోయి పోయి గాలి నెందుకు మూట కట్టుకోవాలని ప్రయత్నించింది? ఆ గాలి మూటకు ఒదగకపోయినా, కొన్ని పరిమళాలు తనపై ముద్రించిపోయిందే! ఆ ముద్రలు తుడిచెయ్యటం సాధ్యమేనా?

"సన్యాసం తీసుకుంటావా? అయితే వేదాంత సారం బోధించటానికి వస్తాను సాయంత్రం." ఫోన్‌లో గంభీరమైన కంఠం మృదువుగా, మంద్రంగా.

"ఓ.కె."

మనసుకి స్త్రిమితం—శాంతి—చల్లదనం—హాయి!

తనకు తెలుసు, అతని సమక్షంలో తప్ప తనకు జీవితం లేదని. కానీ క్షణికమైన ఉక్రోషంలో, గాయపడిన అహం మధించి తీసిన రోషంలో ఏదీ లెక్క చెయ్యని నిర్లక్ష్యంలో మనసు గాలి వైపు పరుగులు తీసింది. వివేకం వద్దు, వద్దంటున్నా గాలి మనసులో సందు చేసుకుని సన్నగా రొద చేస్తోంది, వూపిరి సలపనీయకుండా—అవును. వూపిరి సలపనీయకుండా.

పరిమళం వూపిరిలో—ఆప్యాయత కంఠంలో—లాలన స్పర్శలో

పారవశ్యం పొందబోయే మనసు ఉలికి పడింది. లోలోపలి రొదలో హస్కీ వాయిస్ "నా కోసమేనా ఇదంతా ?"

ఓ గాడ్! ఈ అబ్సెషన్ నుంచి తనకు, విముక్తి లేదా? ఇంతటి సున్నితత్వమా ఈ పాడు మనసుకి?

"ఎందుకు వణుకుతున్నా విలా?" గంభీరమైన కంఠం జాలిగా—ఆత్మీయంగా.

గుండె మీద నుంచి తల ఎత్తి రెండు చేతులతోనే అతని ముఖాన్ని తీసుకుని అడిగింది.

"ఎన్నెన్ని అలలు ఎంతెంతగా ఎగసి విరుగుతున్నా ఘోషించే మనసును నిశ్చల సముద్రంలా ఉంచుకోవటం ఎలా?"

"బుద్ధికి పదును పెట్టుకుని మనసు తోకలను తెగ్గొట్టాలి! అంతరంగాన్ని నిగ్రహించుకొని, ఎక్కడికో ఎగిరిపోవాలని చూసే మనసుని ఎల్లలలో నిలుపుకోవాలి!"

నిజంగా ఇది వేదాంతసారమే! ఇంతకు మించిన దివ్యజ్ఞానం ఏ మతంలోనూ ఉండదు.

"చూశావా? నీ ప్రాణ స్నేహితుడి ఒళ్ళో పడుకున్నా, నువ్వు ఒంటరివే? మన వేదాంత వర్గమంతా ఇంతే! ఎప్పుడూ ఒంటరివాళ్ళమే! నేను చెప్పలేదూ?" లోలోపలి రొదలో హస్కీ వాయిస్!

ఓ గాడ్! రిలీవ్ మీ!

బుద్ధికి పదును పెట్టుకుని... అంతరంగాన్ని నిగ్రహించుకుని...

వద్దు! వద్దు! నవ్వు! రొద చేయకు. ★